సాక్షి ఒడిశా

గురువారం । 18 । ఏప్రిల్ । 2024

నేటి నుంచి పాఠశాలలకు సెలవు

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత పెరిగినందున ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 18 నుంచి 20 వరకు రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ సహకార, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



ప్రయోగం.. పునరావృతం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బీజేడీ ఐదో విడత జాబితా విడుదల చేసింది. కుటుంబీకులు, వలస అభ్యర్థులకు పెద్దపీట వేసింది.

- 8లో.



దార్శనికుడు బిజూ పట్నాయక్

ఒడిశా వరపుత్రుడు బిజూ పట్నాయక్ వర్ధంతి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. నాయకులు బిజూ విగ్రహాల వద్ద నివాళులర్పించారు.

- 8లో.

న్యూస్‌రీల్

జయపురంలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్పీ, ఎస్‌డీపీఓలు

జయపురం: సార్వత్రిక ఎన్నికలు, శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా కొరాపుట్ జిల్లా ఎస్పీ అభినవ సోకార్ నేతృత్వంలో మంగళవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ నేతృత్వంలో జయపురం పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయ్, సబ్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ మహంతి, జయపురం సదర్ పోలీసు స్టేషన్ అధికారి ఈశ్వర చంద్ర తండి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం కొనసాగేలా అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మజ్జిగ వితరణ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మహిళలు

రాయగడ: మండుతున్న ఎండల్లో బాటసారులకు ఉపశమనం కలిగించేలా మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బుధవారం ప్రజా పనుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు కొరాడ రజిత తదితరులు పాల్గొన్నారు. సత్యసాయి సేవా సమితి బృందం కొరాపుట్ కూడలిలో రెండు రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

బీజేడీని వీడి బీజేపీలోకి..



కాషాయ కండువాతో అర్జున్ త్రిపాఠి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా సీనియర్ బీజేడీ నాయకుడు అర్జున్ త్రిపాఠి భారతీయ జనతా పార్టీలో చేరారు. బుధవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో బీజేడీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఫేస్‌బుక్ వేదికగా ప్రకటించారు. అర్జున్ గతంలో నబరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్ష పదవుల్లో కొనసాగారు. మూడంచెల పంచాయతీ ఎన్నికలలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదానితో వైరం మొదలైంది. బీజేడీ సదాశివ సతీమణి కౌసల్యకు నబరంగ్‌పూర్ టికెట్ కేటాయించింది. ఈ విషయమై అర్జున్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పేదరికం, అవినీతి, ప్రజా సమస్యలపై బీజేడీ నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నట్లు అర్జున్ ప్రకటించారు.


కొట్‌పాడ్ బీజేపీ అభ్యర్థిగా రుపు భొత్ర



రుపు భొత్ర

జయపురం: సబ్ డివిజన్‌లోని కొట్‌పాడ్ (ఎస్టీ) నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత ఉద్యోగి రుపు భొత్రను పార్టీ అధిష్టానం ప్రకటించింది. భొత్ర తన ఉద్యోగానికి రాజీనామా చేసి కొట్‌పాడ్ బొండాగుడలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఏడేళ్లుగా బీజేడీ క్రియాశీలక కార్యకర్తగా ఉన్నారు. అనంతరం బీజేపీ ఆదివాసీ వికాశ పరిషత్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. భొత్ర సమాజ్ ఉన్నతికి కృషి చేశాడు.

60 కిలోల గంజాయి స్వాధీనం



కారులో పట్టుబడిన గంజాయి బస్తాలు

జయపురం: కారులో అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. జయపురం సదర్ పోలీసులు మంగళవారం రాత్రి జాతీయ రహదారిలోని ఉమ్మిరి గ్రామ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. జయపురం నుంచి బొరిగుమ్మ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ పోలీసులను చూసి దిగి పారిపోయాడు. వెంటనే పోలీసులు వెళ్లి తనిఖీ చేయగా కారు రహస్య అరలో రెండు బస్తాల గంజాయి గుర్తించినట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపారు. 60 కేజీల బరువున్న ఈ గంజాయి విలువ రూ.6 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, పట్టుబడిన కారుకు నెంబర్ ప్లేట్ లేదని, నిందితుడ్ని త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

మజ్జిగౌరి చైత్రోత్సవాలకు.. వేళాయె!



అమ్మవారి మందిరం

- 19 నుంచి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా
- పక్కాగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ : ఆంధ్ర, ఒడిశా ప్రజల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి రాయగడ మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ముందురోజు సమీపంలోని జంఝావతి నది నుంచి పురోహితులు, కమిటీ సభ్యులు శుద్ధ జలాలను తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో ఉంచి శుద్ధి చేసి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఏటా చైత్ర మాస ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఐదు రోజులూ చండీ హోమం, సూర్యా ఆవాహనం, సొడొపాచార తదితర పూజలు నిర్వహిస్తారు. బరంపురంలోని కవిసూర్యనగర్ నుంచి ప్రత్యేకంగా పురోహితులను రప్పించి పూజా కార్యక్రమాలు జరిపిస్తారు.

కన్యలతో ఘటాల ఊరేగింపు..

ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ అమ్మవారి ఘటాలను పట్టణంలో ఊరేగిస్తారు. దుష్టశక్తులు చొరబడకుండా అమ్మవారు రక్షిస్తారన్నది భక్తుల నమ్మకం. వివాహం కాని యువతులు(కన్యలు) మాత్రమే ఘటాలు మోయడం ఇక్కడి ప్రత్యేకత. అమ్మవారి ప్రతీకగా నిలిచే పసుపు, బియ్యంతో తయారు చేసే బొట్టును అందరికి పంపిణీ చేస్తారు. ఈ మిశ్రమాన్ని నీటిలో కలిపి తాగితే ఎటువంటి రోగాలు దరిచేరవన్నది భక్తుల నమ్మకం.

మల్లెలు తొక్కడం..

ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మల్లెలు తొక్కే కార్యక్రమం ఉంటుంది. ఎర్రని నిప్పులపై పూజారులు ఘటాలను మోసుకుంటూ నడుస్తారు. ముళ్లతో రూపొందించిన ఊయలపై ఊగుతారు. అయినా ఎటువంటి బాధ కలగదని, అమ్మవారు ఉన్నారనడానికి ఇదే నిదర్శనమని భక్తులు చెబుతున్నారు. ఈ ఘట్టం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తారు.

స్థల చరిత్ర..

15వ శతాబ్దంలో నందపూర్ మహారాజైన విశ్వనాథ్ దేవ్ తన రాజ్యాన్ని విస్తరించే కార్యక్రమంలో రాయగడలో కోట కడతారు. నిత్యం కొలిచే అమ్మవారిని కోట మధ్యలో కొలువుదీర్చి పూజలు చేస్తుంటారు. కోట మధ్యలో అమ్మవారిని నిలపడంతో మొరిఖ ఘొరియాణీ (మజ్జి గౌరి)గా పేరు వచ్చింది. తెలుగువారు మజ్జిగౌరిగా, ఒడియా ప్రజలు మొరిఖ ఘొరియాణిగా పిలుస్తుంటారు. విశ్వనాథ్ దేవ్ మహారాజుకు 108 మంది రాణులు ఉండేవారు. గోల్కొండ పాలకుడు ఇబ్రహీం కుతుబ్ షా సేనాధిపతి రుతుఫ్‌ఖాన్ రాయగడపై 1538లో దాడి చేయడంతో రాజు వీరమరణం పొందారు. ఆయన సతీమణులు 108 మంది సతీ సహగమనం చేశారు. మందిర సమీపంలో ప్రాణ త్యాగం చేసిన ఈ ప్రాంతాన్ని సతీకుండంగా పిలుస్తుంటారు. ఏటా సంక్రాంతి నాడు ఈ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

ఆదరణ కరువై..



అమ్మవారి ప్రవేశద్వారం

రాజు మరణానంతరం రాయగడ గోడ శిథిలావస్తకు చేరుకుంది. ఆలనాపాలనా లేక అమ్మవారి మందిరం కూడా జీర్ణావస్తకు చేరుకుంది. 1930లో బ్రిటీషర్లు విజయనగరం నుంచి రాయిపూర్ వరకు రైలు మార్గం వేసేందుకు సన్నహాలు చేస్తున్న క్రమంలో రాయగడ సమీపంలో జంఝావతి నదిపై వంతెన నిర్మాణం చేపడతారు. ఎన్నిసార్లు కట్టినా వంతెన కూలిపోతుండటంతో కాంట్రాక్టర్ ఇబ్బందులు పడుతుంటాడు. ఓ రోజు కాంట్రాక్టర్ కలలో అమ్మవారు దర్శనమిచ్చి వంతెన సమీపంలో గుడి కట్టించి పూజా కార్యక్రమాలు చేస్తే పనులు శరవేగంగా పూర్తవుతాయని చెబుతారు. మెలకువ వచ్చి వెంటనే కాంట్రాక్టర్ ఆ పరిసరాలను వెతకగా పాడైన ఓ చిన్న మందిరంలో అమ్మవారి విగ్రహం కనిపించడంతో వెంటనే కాంట్రాక్టర్ అమ్మవారికి పూజించి మందిర నిర్మాణం చేపట్టారు. వంతెన నిర్మాణ పనులు కూడా పూర్తవుతాయి. ఇది నందపూర్ చరిత్రలో వివరించారు.

అమ్మవారి వాహనం



ఇత్తడి గుర్రం

దుష్టశక్తుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు అమ్మవారు ప్రతి రోజు రాత్రి గుర్రంపై పురవీధుల్లో సంచరిస్తుంటారని చరిత్ర కథనం. దీనికి అనుగుణంగా మందిరం ప్రాంగణంలో అమ్మవారికి ఎదురుగా రంకెలు వేసే విగ్రహాన్ని ఆలయ నిర్వాహకులు 5 క్వింటాళ్ల ఇత్తడితో రూపొందించారు.

ముడుపులు కట్టే చెట్టు..

అమ్మవారి మందిర ప్రాంగణంలో పెద్ద రావి చెట్టు ఉంది. కోర్కెలు తీరాలంటూ భక్తులు ఈ చెట్టుకు ఎర్రని గుడ్డ కడతారు. ఒడిశా, ఆంధ్ర, తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ముఖ్యంగా ఆది, సోమ, మంగళవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువ. అమ్మవారికి నిత్యభోగంతో పాటు చక్కెర, రవ్వ, బియ్యం పిండితో తయారు చేసే కక్కరాలను నైవేద్యంగా సమర్పిస్తారు.

మూడు ప్రాంతాల్లో అమ్మవారి శరీర భాగాలు

మజ్జిగౌరి అమ్మవారి ముఖం మాత్రమే మందిరంలో ఉంటుంది. కేవలం ముఖానికే పూజలు చేయడం ఇక్కడి ప్రత్యేకత. మొండెం వేరే చోట, పాదాలు మరోచోట ఉంటూ పూజలందుకుంటున్నాయి. మందిరం ప్రాంగణానికి కొద్దిదూరంలో అమ్మవారి పాదాలు, రోడ్డుకు ఆవల అమ్మవారి మిగతా శరీర భాగం ఉందన్నది స్థల పురాణం. మొండెం ఉన్న ప్రాంతాన్నే జెన్నరాయిగా పిలుస్తుంటారు. ఇక్కడ దసరా సమయంలో అష్టమి నాడు ప్రత్యేక(నిశా రాత్రి) పూజ చేస్తారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమేపీ పెరగడంతో మందిరం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది.



అమ్మవారి పాదాల మందిరం



సతీ కుండం



ముడుపులు కట్టే చెట్టు

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు..

అమ్మవారి మందిరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల మంజూరు చేసింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ముగిసింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. చైత్రమాస ఉత్సవాలను ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు రూ.12 లక్షలు కేటాయించాం. భక్తులు ఇబ్బందులకు గురికాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. దాదాపు లక్ష మందికిపైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం.



- రాయిసింగి బిడిక, మజ్జి గౌరి, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ

మజ్జిగౌరికి బంగారు ఆభరణాలు



అమ్మవారి ఆభరణాల పెట్టెను తీసుకొస్తున్న రాయిసింగి బిడిక

రాయగడ: ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారి బంగారు ఆభరణాలను సన్నిధికి తీసుకువచ్చారు. ఐదు రోజుల పాటు అమ్మవారు సునాబేసొ (బంగారు ఆభరణాల అలంకరణ)లో దర్శనం ఇవ్వనున్నారు. జిల్లా ట్రెజరీలో ఈ ఆభరణాలను పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు దేవేంద్ర బెహర, వడ్డాది శ్రీనివాసరావు, అమ్మవారి సేవకులు ప్రతాప్ బెరుకొ, కేదర్ బెరుకొ తదితరులు ఆభరణాలను తీసుకువచ్చారు. గురువారం ఆలయ ప్రధాన పూజారి చంద్రశేఖర్ బెరుకొ నేతృత్వంలో అమ్మవారిని ఆభరణాలతో ముస్తాబు చేస్తారు. ఉత్సవాలు ముగిశాక తిరిగి ట్రెజరీకి తరలించి భద్రపరుస్తారు.

శోభాయమానం



శ్రీరామ నవమి వేడుకలు పురస్కరించుకుని నగరంలోని ప్రఖ్యాత రామమందిరం విద్యుద్దీపకాంతులతో ధగధగా మెరిసిపోయింది. బుధవారం ఉదయం నుంచే ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. - భువనేశ్వర్

ఘట ఉత్సవాలు ప్రారంభం



ఘటాలతో పూజారులు

జయపురం: జయపురం ప్రజల ఆరాధ్య దైవం జగజ్జననీ అమ్మవారి ఘట ఉత్సవ పూజలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి ఊరేగింపు చేపట్టారు.

అంతా రామమయం..!



జయపురం: సీతారామ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



భువనేశ్వర్: ఏపీఏలో శ్రీరామ సుప్రభాతం



రాయగడ: టికిరిలో హనుమాన్ వేషధారణలో..



రాయగడ: ఉత్కళ తెలుగు బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో కల్యాణం జరిపిస్తున్న భాస్కరాచార్యుల బృందం

శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. రాష్ట్రవ్యాప్తంగా రామాలయాలు, మందిరాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగించారు. అనంతరం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణ ఘట్టాన్ని వీక్షించాకరు.

- సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: కోమటివీధి రామమందిరంలో పూజలు నిర్వహిస్తున్న ఉగ్రనరసింహాచార్యులు



పర్లాకిమిడి: కొత్తబస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు



రాయగడ: పట్టణంలో భజరంగ్ దళ్ సభ్యుల ర్యాలీ



జయపురం: ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో ఆలయ అధ్యక్షుడు నాగరాజు దంపతులు



కొరాపుట్: నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో భక్తులకు పానీయాల పంపిణీ




జయపురం: పవర్ హౌస్ కూడలిలో హనుమాన్ విగ్రహంతో ఊరేగింపు



జయపురం: జమాల్‌వీధి రామమందిరంలో దీపారాధన

క్లుప్తంగా

సూర్య తిలకం.. ఒడిశా శాస్త్రవేత్త సారథ్యం


రామ్‌లల్లా నుదుటిపై సూర్య తిలకం వెలుగులు

భువనేశ్వర్: అయోధ్యలోని రామ్ లల్లా(బాల రాముడు) విగ్రహం నుదుటిపై సూర్యకిరణ అభిషేకం సూర్య తిలకంగా భక్తుల మనసు దోచుకుంది. ఈ ప్రాజెక్ట్ విజయం సాధించడం ఆనందంగా ఉందని రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ)లోని ఒడియా శాస్త్రవేత్త సరోజ్ కుమార్ పాణిగ్రాహి బుధవారం తెలిపారు. అయోధ్య రామ మందిరం వద్ద పది మంది శాస్త్రవేత్తల బృందానికి ఆయన నాయకత్వం వహించారు. ప్రతి శ్రీరామ నవమి వేడుకల సమయంలో శ్రీరాముని విగ్రహం నుదుటిపై సూర్య కిరణ ప్రసరణ జరిగేలా ఏర్పాటు చేయడం సూర్య తిలక్ ప్రాజెక్ట్ ప్రాథమిక లక్ష్యం. దీనిలో భాగంగా ఏటా చైత్ర మాసంలో శ్రీరామనవమి నాడు ఉదయం 11.58 నుంచి మధ్యాహ్నం 12.02 గంటల వరకు సూర్యకాంతి శ్రీరాముని నుదిటిపైకి వెళ్తుందని సరోజ్ కుమార్ పాణిగ్రాహి వివరించారు. ఆప్టో మెకానికల్ వ్యవస్థలో 4 అద్దాలు, 4 లెన్స్‌లు టిల్ట్ మెకానిజం, పైపింగ్ వ్యవస్థలో అమర్చి సూర్యకిరణాలను గర్భ గృహానికి మళ్లేలా ప్రాజెక్టు రూపొందించినట్లు చెప్పారు. ఇందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ సాంకేతిక మద్దతు, బెంగళూరుకు చెందిన ఆప్టికా కంపెనీ తయారీ నైపుణ్యం ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

సోంపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోంపేట అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గౌరీ శంకర్ అపార్ట్‌మెంట్ వద్ద గ్యాస్ ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు జరిగేటప్పుడు అప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది డి.భాస్కరరావు, కె.భాస్కరరావు, సింహాచలం, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

26 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం పంచాయతీ కేకేనాయుడుపేట గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 26 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో కలిసి మద్యం నిల్వలు గుర్తించారు. కె.గోపాల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్: అప్పుల బాధ తాళలేక వప్పంగి గ్రామానికి చెందిన మంత్రి శ్రీధర్(38) బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు అందించిన వివరాలు మేరకు.. వప్పంగి గ్రామానికి చెందిన మంత్రి శ్రీధర్ నగరంలోని డేఅండ్‌నైట్ కూడలిలో నాయుడు ట్రేడర్స్ అనే పురుగుల మందు షాపును నడుపుతున్నాడు. ఈయనకు మాధవి అనే మహిళతో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కొడుకు ఉన్నాడు. కొంతకాలంగా శ్రీధర్ అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. వ్యాపారం కూడా సరిగ్గా నడవడం లేదు. దీంతో మంగళవారం రాత్రి షాపు కట్టేసి తన బైక్‌పై మునసబు పేట వద్ద గల ఓ ప్రైవేటు లేవుట్ లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన కొంతమంది యువకులు చూసి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి పక్కన ఉన్న ద్విచక్రవాహనం రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా వప్పంగి వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బూర్జ: మండలంలో గల ఉప్పినివలస గ్రామం కోనేరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలియజేసిన సమా చారం మేరకు.. వైకుంఠపురం గ్రామానికి చెందిన తమ్మినేని సింహాచలం రోజు లాగానే పాలు అమ్ముకోడానికి సైకిల్‌పై ఉప్పినివలస వెళ్తున్నాడు. అదే మండలం కొల్లివలస గ్రామానికి చెందిన బూరవెల్లి రమణ బైక్‌పై వచ్చి వెనుక నుంచి సింహాచలం సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఇద్దరికీ తలకు గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు క్షతగాత్రులను గుర్తించి 108 కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి వారిని శ్రీకాకుళంలోని మెడీకవర్‌కు తీసుకెళ్లారు. సింహాచలం తలకు బలమైన గాయం తగలడంతో సీరియస్‌గా ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆస్పత్రి నుంచి పోలీసులకు సమాచారం అందింది.

ప్రయోగం.. పునరావృతం

- కుటుంబీకులు, వలస అభ్యర్థులకు పెద్దపీట వేసిన బీజేడీ
- 2019 నాటి వ్యూహమే అనుసరించిన సీఎం నవీన్
- ఈసారీ రెండు చోట్లా పోటీ


సీఎం నవీన్ పట్నాయక్‌తో దేవ్‌గఢ్ శాసన సభ్య బీజేడీ అభ్యర్థి, రాజవంశీకురాలు అరుంధతీ దేవి

భువనేశ్వర్: అధికార పక్షం బిజూ జనతా దళ్ తొమ్మిది మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో కూడిన ఐదో జాబితాను బుధవారం ప్రకటించింది. నవీన్ పట్నాయక్ వ్యూహాత్మక శైలి ఈ జాబితాలో స్పష్టమైంది. ప్రధానంగా పశ్చిమ ఒడిశాలో నవీన్ రాజకీయ చతురత పలువురు ప్రత్యర్థి అభ్యర్థులకు ఖంగు తినిపించింది. తాజా జాబితాలో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను మినహాయించి అనేక మంది వలస అభ్యర్థులకు పట్టం గట్టడం విశేషం. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి గంజాం జిల్లా హింజిలి, పశ్చిమ ఒడిశా బిజేపూర్ 2 నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. తుది ఫలితాల తరువాత బీజేపూర్ సీటును వదులుకుని శాసన సభలో హింజిలికి ప్రాతినిధ్యం వహించారు. తదుపరి జరిగిన ఉప ఎన్నికలో రీతా సాహు ఆ స్థానాన్ని గెలుచుకున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు బీజేడీ అగ్ర నాయకత్వం సంప్రదింపుల మేరకు శాసనసభ ఎన్నికల్లో పోటీకి ఖరారైన ఇద్దరు అభ్యర్థుల నియోజకవర్గాలను మార్చింది. తాజాగా తొమ్మిది స్థానాల్లో అభ్యర్థుల పేర్లను దళం ఖరారు చేసింది. ఇద్దరు సీనియర్ నాయకులను తొలగించి వారి భార్యలతో ఖాళీని భర్తీ చేసేందుకు గట్టి సవాల్ విసిరింది. ఈ చర్య పట్ల ప్రతిచర్య నిరీక్షణలో ఉంది.

రెండు స్థానాల నుంచి దళపతి..

బిజూ జనతా దళ్ అధ్యక్షుడుచ, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గంజాం జిల్లాలోని తన సాంప్రదాయ హింజిలీ స్థానంతో పాటు పశ్చిమ ఒడిశా బొలంగీర్ జిల్లా కంటాబంజీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. ఈ ఎన్నికల్లో వరుసగా ఆరోసారి తిరిగి ఎన్నికయ్యే దృఢ సంకల్పంతో ఏకకాలంలో 2 స్థానాల నుంచి బరిలోకి దిగారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సంతోష్ సింగ్ సలూజాపై పోటీ చేస్తున్నారు. 4 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్లీ ఖరారయ్యారు. అయినప్పటికీ బీజేడీ వైపు అడుగు వేస్తారనే ఊహాగానాలు చెలరేగాయి. కంటాబంజీ నుంచి నవీన్ ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఆ పుకార్లకు చెక్ పెట్టారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో బీజేడీ అధినేత నవీన్ ఏక కాలంలో రెండు స్థానాల్లో పోటీ చేయడం వరుసగా ఇది రెండోసారి. 2019 అసెంబ్లీ ఎన్నికలలో గంజాం జిల్లా హింజిలి మరియు పశ్చిమ ఒడిశా బిజేపూర్ నుండి పోటీ చేసి రెండింట గెలిచారు. తాజాగా జారీ చేసిన జాబితాలో మరోసారి ఇదే ప్రయోగంతో నవీన్ రంగంలోకి దిగడం చర్చనీయాంశమైంది. గంజాం జిల్లా నవీన్ పట్నాయక్ సొంత జిల్లా కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఎన్నికల్లో రెండు చోట్ల నుంచి విజేతగా నిలిచిన సొంత జిల్లాకు ప్రాధాన్యత కల్పించారు.

కుటుంబ సభ్యులకే సీటు..

తాజాగా విడుదల చేసిన మాజీలు బదులుగా వారి కుటుంబీకులకు పట్టం గట్టారు. ఈ క్రమంలో బీజేడీ మాజీ మంత్రి రబీ నారాయణ నొందొ బదులుగా ఆయన భార్య ఇందిరా నొందొకు జయపురం నుంచి పోటీకి ఖరారు చేశారు. శంఖం పార్టీ సిట్టింగ్ అంగుల్ ఎమ్మెల్యే రజనీకాంత్ సింగ్ స్థానంలో అతని భార్య సంజుక్తా సింగ్‌ను ఈసారి పోటీకి ఖరారు చేశారు. సనోఖెముండి అసెంబ్లీ నియోజక వర్గంలో సులక్షణ గీతాంజలి దేవి ధరాకోట్ రాజకుటుంబ రాజకీయ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లనున్నారు.

'బీజేడీ ఐదో విడత అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	అభ్యర్థి
చిత్రకొండ	లక్ష్మీప్రియా నాయక్
పదమ్‌పూర్	బొర్షా సింగ్ బొరిహా
కుచిండా	రాజేంద్ర ఛత్రియా
దేవ్‌గడ్	అరుంధతీ దేవి
అంగుల్	సంజుక్తా సింగ్
నిమ్మాపడా	దిలీప్ నాయక్
సన్నొఖెముండి	గీతాంజలి దేవి
జయపురం	ఇందిరా నొందొ
రైరాఖోల్	ప్రసన్న ఆచార్య
సంబలపూర్	రోహిత్ పూజారి
కంటాబంజి	నవీన్ పట్నాయక్

వలసలకు తక్షణ అవకాశం..

బీజేడీలో చేరిన 24 గంటలలోపే సంబల్‌పూర్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి, ఎంపీ నితీష్ గంగదేవ్ భార్య అరుంధతీ దేవికి దేవ్‌గడ్ అసెంబ్లీ సీటు లభించింది. మంగళవారం సాయంత్రం దేవ్‌గడ్ రాణి, ఆమె కుమారుడు నమన్ గంగదేవ్ బీజేడీలో చేరడంతో సంబల్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో సరికొత్త రాజకీయ వాతావరణం ప్రేరేపించింది. ఈసారి సంబలపూర్ లోక్ సభ స్థానంలో బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేడీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ మధ్య ప్రత్యక్ష పోటీ ప్రాధాన్యంసంతరించుకుంది. బీజేడీ పదమ్‌పూర్ నియోజక వర్గం నుంచి బొర్షా సింగ్ బొరిహాను మరో మారు అభ్యర్థిగా ఖరారు చేసింది.

మహిళా ప్రాతినిధ్యం..

బీజేడీ తాజాగా విడుదల చేసిన తొమ్మిది స్థానాల అభ్యర్థుల్లో మహిళా ప్రాతినిధ్యం బలం పుంజుకుంది. ఆరుగురు మహిళా అభ్యర్థులను బీజేడీ ఖరారు చేసింది. ఇప్పటివరకు ప్రకటించిన 126 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 26 మంది మహిళలకు సీట్లు కేటాయించారు. 2019లో 147 మంది అభ్యర్థుల్లో 20 మంది మహిళలకు అవకాశం కల్పించగా 12 మంది విజేతలుగా నిలిచారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం మూడింట ఒక వంతు ప్రాతినిధ్యం కల్పిస్తామన్న నినాదానికి కట్టుబడి బీజేడీ ఆచితూచి అడుగులు వేస్తుంది.

సిటింగ్‌లపై వేటు

నలుగురు సిటింగ్ ఎమ్మెల్యేలు పూర్ణ చంద్ర బాక (చిత్రకొండ), కిషోర్ చంద్ర నాయక్ (కుచిండా), రజనీకాంత్ సింగ్ (అంగుల్), సమీర్ రంజన్‌దాస్ (నిమాపడా)లకు పార్టీ ఈసారి పోటీకి అవకాశం కల్పించలేదు. కుచిండాలో కిషోర్ చంద్ర నాయక్ స్థానంలో మాజీ ఎమ్మెల్యే రాజేంద్రకుమార్ ఛత్రియా ఖరారయ్యారు. మరో ఫిరాయింపుదారుడు దిలీప్ నాయక్‌కు కూడా బీజేడీ టిక్కెట్టు ఖరారైంది. సెప్టెంబరు 2022లో బీజేడీ జిల్లా పరిషత్ సభ్యుడు ధర్మేంద్ర సాహు మరణంలో అనుమానాస్పద పాత్రపై వివాదం ఎదుర్కొన్న సిట్టింగ్ ఎమ్మెల్యే సమీర్ రంజన్ దాస్‌ను ఆయన భర్తీ చేశారు. 2019 ఎన్నికల్లో చిత్రకొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన లక్ష్మీప్రియా నాయక్ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అదే స్థానం నుంచి అధికార పార్టీ బీజేడీ టికెట్‌పై పోటీ చేయనున్నారు.

సీటు మార్పిడి..

బీజేడీ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చుకుంది. మాజీ మంత్రి ప్రసన్న ఆచార్య రైరఖోల్ నుంచి, రోహిత్ పూజారి సంబల్‌పూర్ నుంచి పోటీ చేయనున్నారు. ప్రసన్న ఆచార్య తనను సంబల్‌పూర్ నుంచి పోటీకి దింపాలన్న పార్టీ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసి బదులుగా 2009లో తాను ఎన్నికైన రైరఖోల్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు బీజేడీ అధిష్టానంతో జరిగిన సంప్రదింపులు ఫలప్రదం అయినట్లు సీట్ల సర్దుబాటులో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ నెల 12న నవీన్‌ను కూడా కలిసి నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిందిగా అభ్యర్థించారు.

దార్శనికుడు బిజూ పట్నాయక్


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో బిజూ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఈశ్వర్ పాణిగ్రహి, కౌసల్య, నాయకులు


రాయగడ: బిజూ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నెక్కంటి భాస్కరరావు


పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్‌లో బిజూ విగ్రహానికి పూలమాల వేస్తున్న రూపేష్ పాణిగ్రాహి


పర్లాకిమిడి: ఆస్పత్రిలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ అడుగుజాడల్లో యువత నడుచుకుని నవ ఒడిశా నిర్మాణానికి కృషి చేయాలని బీజేడీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. రాయగడ కొత్తబస్టాండ్ వద్ద బుధవారం బిజూ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ రాష్ట్ర వరపుత్రుడిగా ఎన్నో సేవలందించిన బిజూను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక తదితరులు పాల్గొన్నారు.

- పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి బీజేడీ కార్యాలయంలో బుధవారం బిజూ పట్నాయక్ వర్ధంతి నిర్వహించారు. అనంతరం జిల్లా 50 పడకల ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, కాశీనగర్ బీజేడీ ఉపాధ్యక్షుడు రొక్కం సతీష్, జెడ్పీటీసీ సభ్యురాలు (జోన్-1) రొక్కం రాజ్యలక్ష్మి, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, లక్ష్మీకాంత పోరిచ్చా, మారుత్ పాలో, ఎస్‌డీసీ జిల్లా చైర్మన్ మరియం రైయి తదితరులు పాల్గొన్నారు.
- కొరాపుట్: ఉత్కళవర పుత్రుడు, దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్ పాణిగ్రాహి, నబరంగ్‌పూర్ లోక్‌సభ అభ్యర్థి ప్రదీప్ మజ్జి, నబరంగ్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థి కౌసల్య ప్రదాని, డాబుగాం అసెంబ్లీ అభ్యర్థి మనోహర్ రంధారి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని పాల్గొన్నారు. ఉమ్మర్‌కోట్‌లో జోరిగాం అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ రమేష్ చంద్ర మజ్జి బిజూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కొరాపుట్‌లో అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘురాం పాడాల్ నివాళులు అర్పించారు. లక్ష్మీపూర్‌లో బీజేడీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.


కొరాపుట్: ఉమ్మర్ కోట్‌లో నివాళులు అర్పిస్తున్న ఎంపీ రమేష్ మజ్జి


కొరాపుట్‌లో బిజూ విగ్రహం వద్ద ఎమ్మెల్యే రఘురాం పాడాల్ తదితరులు


కొరాపుట్ లక్ష్మీపూర్‌లో బీజేడీ కార్యకర్తల బైక్ ర్యాలీ

బంగారం అక్రమ రవాణా గుట్టురట్టు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ)లో బుధవారం అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఇతను కడుపు లోపలి భాగం(పురీషనాళం/మలద్వారం)లో సుమారు కిలో బంగారు గుళికలను చొప్పించి జారుకునే ప్రయత్నంలో పట్టుబడ్డాడు. కస్టమ్స్ విభాగం అధికారులు తనిఖీ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి భువనేశ్వర్‌లో దిగిన ఆ ప్రయాణికుడు ఈ వింత పద్ధతిని అనుసరించి బంగారం తరలించేందుకు యత్నించాడు. కస్టమ్స్ అధికారులు, విమానాశ్రయ అధికారులు మెటల్ డిటెక్టర్ సాయంతో అతడిని తనిఖీ చేసినప్పటికీ బంగారాన్ని గుర్తించడంలో విఫలమయ్యారు. అయితే ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా కస్టమ్స్ అధికారులు అతన్ని వాష్‌రూమ్‌లో పరిశీలించగా బంగారం బయటపడింది. బంగారాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేశారు. ఇతను బ్యాంకాక్ నుంచి ముంబైకి వెళ్తున్నాడని, పట్టుబడిన బంగారం విలువ దాదాపు రూ.70 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

కరుణించి గెలిపించండి


దండాలు పెడుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్న కాళీరాం

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ స్థానంలో బీజేపీ తరపున రెండోసారి ఎన్నికల బరిలో నిల్చున్న కాళీరాం మాఝి తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వంగి..వంగి దండాలు పెట్టి తనను గెలిపించమని మరీ అభ్యర్థిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి పరాజయం పొందిన కాళీరాంకు మరోసారి ఆ పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకునేందుకు ఆయన ఆదివాసీ బస్తీల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా కాసీపూర్ పరిసర ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లి తనను గెలిపించాలని కోరుతున్నారు.

గెలుపే లక్ష్యంగా బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న బీజేడీ కార్యకర్తలు


బైక్ ర్యాలీలో పాల్గొన్న రఘునాథ్ గొమాంగొ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ అభ్యర్థిగా రెండో సారి ఎన్నికల బరిలో ఉన్న రఘునాథ్ గొమాంగొ బుధవారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గం పరిధిలోని విక్రంపురం నుంచి బైకు ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు, అభిమానులతో కలిసి ప్రతివీధి వెళ్లి తనను గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. 2019లో ఇక్కడి నుంచే బీజేడీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. మరోసారి తన గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఈసారి సమీప ప్రత్యర్థులు సత్యజీత్ గొమాంగొ(కాంగ్రెస్), త్రినాథ్ గొమాంగొ(బీజేపీ)లు గట్టిపోటీ ఇస్తున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడొ సత్యజిత్‌కు మద్దతిస్తున్నారు.

ఓటే వజ్రాయుధం


ఓటు ప్రాధాన్యత తెలియజేస్తూ గోడలపై చిత్రాలు

జయపురం: ఓటు హక్కు ఆవశ్యకత వివరిస్తూ కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కార్తికేయన్ పలు చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జయపురం ప్రభుత్వ ఉన్నత ఉన్నత పాఠశాల గోడలపై ఓటు విలువను తెలియజేస్తూ పలు నినాదాలను ఛాయాచిత్రాల రూపంలో తెలియజేశారు. ఎన్నికలు జరిగే సమయం, ఈవీఎంలు, ఓటు బాధ్యత తదితర వివరాలు తెలియజేస్తూ 16 మంది చిత్ర కళాకారులు ఆర్ట్ రూపంలో బొమ్మలు చిత్రీకరించారు. ఏపీడీ హిమాంశు భూషణ శతపతి, జయపురం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్‌లు పర్యవేక్షిస్తున్నారు.



నా ఓటు నా బాధ్యత

క్లుప్తంగా

నేత్రదానంతో పునర్జన్మ



వరహాలమ్మ నుంచి కార్నియాను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి అమ్మవారి కాలనీకి చెందిన పెంకి వరహాలమ్మ (80)నేత్ర దానంతో పునర్జన్మ పొందింది. బుధవారం ఆమె మృతి చెందడంతో కుమారులు పెంకి గౌరీశ్వరరావు, వెంకటరావు, మనుమడు పెంకి చైతన్యకుమార్‌లు ఆమె నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు సమాచారం అందించారు. వరహాలమ్మ నుంచి సేకరించిన కార్నియాను విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందించనున్నామని మగటపల్లి శ్రీధర్ నేత్ర సేకరణ కేంద్రానికి చెందిన టెక్నీషియన్ కల్యాణి తెలిపారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్‌తో పాటు పట్టణవాసులు అభినందించారు.

నగదు స్వాధీనం



చెక్‌పోస్టు వద్ద స్వాధీన పర్చుకున్న నగదుకు సంబంధించి రసీదు అందిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని చిన మంగళాపురం కూడలి(విశాఖ రహదారి)లో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద ఎన్నికల నిర్వహణ ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో విజయనగరం నుంచి వస్తున్న స్వస్తిక్ ఎంటర్‌ప్రైజస్ ఏజెంటు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ.2లక్షల 50వేలను స్వాధీనపర్చుకున్నారు. సదరు నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచిస్తూ అధికారులు రసీదును అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరరావు

రాజాం సిటీ: పట్టణ పరిధి జీఎంఆర్ ఐటీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పాలకొండ వైపు నుంచి రాజాం వస్తున్న ద్విచక్ర వాహనం, రాజాం నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న పాలకొండకు చెందిన బంకి సంపత్‌కు కాలి మడమకు తీవ్ర గాయాలు కాగా, వెనుక ఉన్న సంతకవిటి మండలం చిన్నయ్యపేటకు చెందిన చిత్తిరి ఈశ్వరరావు కుడికాలు విరిగిపోయింది. వీరిని స్థానికులు 108 ద్వారా జీఎంఆర్ కేర్‌కు తరలించి చికిత్సనందించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సంతకవిటి ఎస్ఐ శంకర్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

పార్వతీపురం: అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లుచేసి సిద్ధగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గల సహాయ రిటర్నింగ్ అధికారులు, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద గట్టి నిఘా ఏర్పాటుచేయాలని, చెక్‌పోస్టులు నిరంతరం పనిచేయాలని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, వీడియో వ్యూయింగ్ బృందాలు పటిష్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి లోపాలు జరగకుండా ప్రశాంతంగా, సజావుగా జరగాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన అనుమతులకు సువిధ పోర్టల్‌లో అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అందుకు ఒక నోడల్ అధికారిని నియమించామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత మాట్లాడుతూ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పాడేరు, అరకు, రంపచోడవరం శాసనసభ నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అరకు, పాడేరు, రంపచోడవరంలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రంపచోడవరం గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అరకు, పాడేరు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి పాడేరులో లెక్కింపు జరుగుతుందని వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఎస్‌డీసీ ఆర్‌వీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

జగదానందకారకా...

- వైభవంగా సీతారాముల పరిణయం
- కనులారా వీక్షించి పులకించిన భక్త జనం
- జై శ్రీరామ్ అంటూ మార్మోగిన రామతీర్థం



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు ఆలయానికి వచ్చిన మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులు



సీతారాముల కల్యాణ వైభవం



ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను స్వామి వారికి సమర్పిస్తున్న సింహాచలం దేవ స్థానం ఈఓ శ్రీనివాసమూర్తి

నెల్లిమర్ల రూరల్: జై శ్రీరామ్ నామంతో రామతీర్థం పులకించింది. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణ నడుమ సీతారామచంద్రస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దశరథ పుత్రుడు శ్రీరామచంద్రస్వామి వారి పెళ్లి తంతు కొనసాగింది. సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామివారు సీతమ్మతల్లి మెడలో మాంగళ్యధారణ చేశారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు వచ్చిన అశేష భక్తజనులు మహోఘట్టాన్ని చూసి తరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 3 గంటలకు ఆరాధన, బాలభోగం, సేవాకాలం కార్యక్రమాలను నిర్వహించారు. 6 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి చేపట్టారు. తరువాత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు.

సిరి కల్యాణపు బొట్టును పెట్టి...

కల్యాణ మండపం మధ్య భాగంలో అమ్మవారిని, స్వామివారిని ఆశీనులను చేశారు. శ్రీరామచంద్ర ప్రభువుకు ఏకాంతంగా అవతార సర్గ విన్నపం



స్వామివారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలను అర్చకుడుకు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబ సభ్యులు

నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణులకు అత్యంత వైభవంగా పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఫల రసాలు, సముద్ర నదీ జలాలతో అభిషేకం చేశారు. అర్చకస్వాములు ప్రతీ తంతుకు వేద మంత్రాన్ని పఠిస్తూ కల్యాణ ఘట్టాన్ని కొనసాగించారు. కల్యాణ తంతులో భాగంగా స్వామివారికి 'కన్యావరణ' 'యజ్ఞోపవీతధారణ' జరిపించారు. వధూవరుల వంశ గోత్ర నామాలను ప్రవచించారు. ఆశీర్వచనం, పాదప్రక్షాళనం, పుష్పోదకస్నానం నిర్వహించి వరపూజ చేశారు. అనంతరం స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ చేశారు.

జీలకర్ర–బెల్లం

వేద పండితులు వేద మంత్రోచ్చరణ చేస్తూ సరిగ్గా



జీలకర్ర బెల్లం సమర్పిస్తున్న అర్చకుడు

మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారామస్వామి వార్ల శిరస్సుపై ఉంచారు. అనంతరం అర్చకస్వాములు మంత్రాలను జపిస్తూ శాస్త్రోక్తంగా సాక్షాత్తు సీతమ్మ తల్లి మంగళసూత్రాలను భక్త జనులకు చూపించి మాంగళ్యధారణ గావించారు. కల్యాణం జరుగుతున్నంత సేపు నంద్యాలకు చెందిన వ్యాఖ్యాతకర్త సుదర్శన జీవీ హాయగ్రీవాచార్యులు స్వామివారి కల్యాణ గొప్పతనాన్ని భక్తులకు వివరించారు.

ఆణిముత్యములే తలంబ్రాలుగా...

కల్యాణ ఘట్టం అనంతరం ప్రధాన ఘట్టమైన తలంబ్రాల వేడుక కనులపండువగా సాగింది. గోటితో ఒలిచిన పవిత్ర తలంబ్రాల్లో మంచిముత్యాలు కలిపి సీతారాముల శిరస్సుపై నుంచి వేశారు. అర్చకుల వేద మంత్రోచ్చరణ నడుమ తలంబ్రాల సేవను జరిపించారు. కల్యాణ వేడుక జరుగుతున్నంత వరకు ప్రాంగణమంతా రామనామస్మరణతో మార్మోగింది. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను తీసుకొని భక్తులు తిరిగి పయనమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



పట్టువస్త్రాలను తెస్తున్న శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి



సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పట్టువస్త్రాలను సమర్పించిన సింహాచలం ఈఓ..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి నవమి వేడుకులకు హాజరై తిరుపతి, సింహాచలం దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలు, తలంబ్రాలు స్వామివారికి సమర్పించారు. విశాఖ, విజయనగరం జిల్లా న్యాయమూర్తులు గిరిధర్, చక్రవర్తి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీ దంపతులు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు దంపతులు, జేసీ కె.కార్తీక్, ఆర్డీఓ సూర్యకళ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారామ స్వామివారికి ఆనవాయితీగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణవేదిక వద్ద వేంచేసి ఉన్న సీతారాములను దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. సతివాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈఓ శ్రీనివాసరావు, శ్రీనివాసనంద సరస్వతి, శ్రవణ చైతన్య చినస్వామీజీ, తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి.. డబ్బులు లాక్కొని పరార్

విజయనగరం క్రైమ్: కొంతమంది విద్యార్థులకు గంజాయి సప్లయి చేస్తున్నట్లు కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసిన విద్యార్థిపై బెదిరింపులకు పాల్పడి అతని ఫోన్ పే నుంచి డబ్బులు తీసుకుని, రూ.5వేలు ఇచ్చి సెల్ పట్టుకెళ్లాలని పరారైన వ్యక్తులపై బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అయ్యన్నపేట వద్ద ఉన్న ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న భరత్‌కుమార్ అతను స్నేహితులు భార్గవ్, రాజేంద్ర, సాయి 15 రోజుల క్రితం ఫేర్ వెల్ డే సందర్భంగా కొంత మందితో కలిసి గంజాయి సేవించారు. వారికి గతంలో కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థి పైడిరాజు గంజాయి సప్లయి చేసేవాడు. ఆ విషయాన్ని భరత్‌కుమార్ కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినట్లు పైడిరాజు భావించి ఈ నెల 16న ఉదయం 8.30 గంటల ప్రాంతంలో భరత్ ఇంటికి అతని స్నేహితుడు వంశీతో కలిసి బైక్‌పై వచ్చి తాను గంజాయి సప్లయి చేస్తున్నానని అందరికీ చెప్తావా అని చేయి చేసుకున్నాడు. అతని మొబైల్ నుంచి ఫోన్ ద్వారా రూ.400 ఫోన్‌పే చేయించాడు. రూ.5వేలు ఇస్తే సెల్‌ఫోన్ ఇస్తానని బెదిరించి బైక్‌పై తిరిగి వెళ్లిపోయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బుధవారం పైడిరాజు, వంశీలను అయ్యన్నపేట జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్ నిమిత్తం జిల్లా కోర్టుకు పంపించారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఐటీడీఏ పీఓ



సీసీ కెమెరాల ఏర్పాటు, పనితీరును పరిశీలిస్తున్న ఆర్ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్‌ను ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల రికార్డులు తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభంకానున్న నేపథ్యంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ సమీపంలో బారికేడ్లు తదితర ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆదుకుంటున్న అపర సంజీవని

- లక్షలాది మందికి సేవలందిస్తున్న 108 వాహనాలు



108 అంబులెన్సులో గర్భిణిని తరలిస్తున్న సిబ్బంది



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, పురిటినొప్పులు వచ్చే సమయంలో ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు, ఊపిరి ఆడక ఇబ్బంది పడే రోగులు, పాము కాటుకు గురైన బాధితులు, గుండె పోటు, పక్షవాతం వచ్చిన వారు, తీవ్రమైన కడుపు నొప్పి ఇలా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చి 108 అంబులెన్సు పునర్జన్మ ప్రసాదిస్తోంది. గడిచిన ఐదేళ్లలో లక్షలాది మందికి 108 అంబులెన్సుల ద్వారా సిబ్బంది సేవలు అందించారు. శిథిలావస్థకు చేరిన 108 అంబులెన్సులను 2019లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మార్చేసి అత్యాధునిక వసతులతో కూడిన కొత్త అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అంతేకాకుండా నవజాత శిశువుల కోసం నియోనేటల్ ప్రత్యేక అంబులెన్సును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆపద జరిగిందని ఫోన్ వచ్చిన క్షణాల్లో సంఘటన స్థలానికి కుయ్‌కుయ్ మంటూ 108 అంబులెన్సు వాలిపోయి బాధితులను ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడుతోంది. కొత్త వాహనాలను జిల్లాలో 2020 లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 2,17,460 మందికి సేవలు అందించారు. ఏడాదికి 50 వేల నుంచి 80 వేల మంది 108 అంబులెన్సుల సేవలు పొందుతున్నారు.

బట్లభద్ర చెరువులో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బట్లభద్ర చెరువు, పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఈ క్రమంలో పామాయిల్, అరటి పంటలు, వరి చేలలో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రాత్రివేళ వెంకటరాజపురం, సీమనాయుడువలస, బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోని పామాయిల్ తోటలో ఏనుగులు తిష్ఠ వేయడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వెంకటరాజపురం, బట్లభద్ర, బిత్రపాడు గ్రామాలకు రాత్రి సమయాన వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉన్నందున పంట పొలాలకు వెళ్లే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ సిబ్బంది హెచ్చరిస్తున్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రూరల్ ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో తిరుగుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

నర్సింగ్ విద్యార్థినిపై అత్యాచార యత్నం

- సర్వజన ఆస్పత్రిలో రోగి అటెండర్ నిర్వాకం
- కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు

విజయనగరం ఫోర్ట్: సర్వజన ఆస్పత్రిలో ఓ నర్సింగ్ విద్యార్థినిపై రోగి బంధువు ఒకరు అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. ఆస్పత్రి సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాలు.. గంట్యాడ మండలానికి చెందిన గోపి అనే వ్యక్తి తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని కొద్ది రోజులు క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మెడికల్ వార్డులో చేర్పించాడు. గోపి తన తల్లి దగ్గర సహాయకుడిగా ఉంటున్నాడు. మంగళవారం రాత్రి విధులకు హాజరైన నర్సింగ్ విద్యార్థిని ఒకరు దుస్తులు మార్చుకునే గదిలో మంచినీరు తాగేందుకు వెళ్లింది. అప్పటికే ఆ గదిలో గోపి లైట్ ఆఫ్ చేసి దాక్కున్నాడు. నర్సింగ్ విద్యార్థి రాగానే ఆమెపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. దీంతో ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. అక్కడ ఉన్న నర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది గదిలోకి వెళ్లి చూడగా గోపి ఉన్నాడు. అతన్ని పట్టుకోవడానికి సెక్యూరిటీ సిబ్బంది ప్రయత్నించగా పరిగెత్తుకుంటూ వెళ్లి వార్డు పక్కన ఉన్న ఆపరేషన్ థియేటర్ అద్దాలను చేతితో బలంగా బద్దలు గొట్టాడు. చేతిని వెనక్కి తీసే ప్రయత్నంలో అతని చేతికి గాయం అయింది. దీంతో అతన్ని ఆస్పత్రిలో చేర్పించి వైద్య



గోపి పగులు గొట్టిన ఆపరేషన్ థియేటర్ డోర్ అద్దం

సిబ్బంది వైద్యం అందించారు. సంఘటన జరిగిన వెంటనే ఆస్పత్రి అధికారులు వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెంకటరావు తెలిపారు.

అన్వేషిక సైన్స్ సెంటర్ ప్రారంభం



తరంగ అభి లక్షణాలు తెలిపే ఫిజిక్స్ ప్రయోగాలను చేసి చూపుతున్న డాక్టర్ చంద్రశేఖరరావు

విజయనగరం అర్బన్: భౌతిక శాస్త్రంలోని ప్రయోగాలను సులభంగా అర్థం కావడానికి అవసరమైన అన్వేషిక సైన్స్ సెంటర్‌ను స్థానిక కామాక్షినగర్‌లో కాన్పూర్ నుంచి వర్చువల్ ద్వారా పద్మశ్రీ ప్రొఫెసర్ హెచ్‌సీవర్మ బుధవారం ప్రారంభించారు. నేషనల్ అన్వేషిక నెట్వర్క్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డేను పురస్కరించుకొని నూతనంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షులు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ జోగా చంద్రశేఖరరావు తెలియజేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్వేషిక సెంటర్లతో అనుసంధానం చేసి విదార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలలో అభిరుచిని, ఆసక్తి, పెంపొందించడానికి ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు భౌతిక శాస్త్రంలోని కఠినతర అంశాలను సులుభతరంగా ప్రయోగాత్మకంగా చెప్పి నేర్పించడం ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. అన్వేషిక సెంటర్ ప్రయోజనాలను సంబంధిత ఫిజిక్స్ లెక్చరర్స్ విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఖాళీ సమయంలో సెలవు సమయాల్లోనూ అన్వేషిక సెంటర్ తెరచి ఉంటుందన్నారు. నిత్య జీవితంలో జరిగే ఉదాహరణలు తీసుకుని భౌతిక శాస్త్రాన్ని బోధించినట్లయితే విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం భౌతిక శాస్త్ర అంశాలకు సంబంధించిన పలు ప్రయోగాలను చేసి చూపించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయిన శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ డీబీ రాధాకృష్ణమూర్తికి 'అన్వేషిక ఆచార్య అవార్డు–2024' పురస్కారంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అన్వేషిక ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, వెంకట్రావు, వేణుగోపాలరావు, ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు శ్రీనివాసరావు, కృష్ణారావు, మహేష్ పాల్గొన్నారు.

ఇదే..మొదటిసారి..!

- సీతంపేట ఐటీడీఏలో నామినేషన్ల స్వీకరణ
- నేడే ఎన్నికల నోటిఫికేషన్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఏర్పడి ఐదు దశాబ్దాలైంది. ఇప్పటి వరకు ఇక్కడ ఎటువంటి ఎన్నికల కార్యకలాపాలు నిర్వహించలేదు. తొలిసారిగా 2024 సార్వత్రిక ఎన్నికలకు సబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఇక్కడి ఐటీడీఏలో జరగనుంది. ఈ ఐటీడీఏ అన్నిరకాల మౌలికవసతులు కలిగి ఉండడం, ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కావడంతో సీతంపేట ఐటీడీఏలో నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈనెల 18న సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. దీనిలో భాగంగా నామినేషన్ల పర్వం ఐటీడీఏలోనే కొనసాగనుంది. అధికారులు ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నామినేషన్ల దాఖలు..

రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం నుంచి వంద మీటర్ల పరిధిలోకి మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుంది.

నామినేషన్ పరిశీలన..

అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, ఒక ప్రతిపాదికుడు, మరో వ్యక్తి (న్యాయవాది కావచ్చు) పరిశీలనకు వెళ్ల



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

వచ్చు. దీనికి అభ్యర్థి రాతపూర్వకంగా అనుమతి ఇవ్వాల్సిన అవసరం ఉంది.

మార్గదర్శకాలివే..

అభ్యర్థి కాని పార్టీ కాని కులమత భాషా విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ప్రసంగించడం చేయరాదు. విధానాలు, కార్యక్రమాలపై ప్రసంగాలు, విమర్శలు ఉండాలి. వ్యక్తిగత జీవితంపై విమర్శలు ఉండకూడదు. కుల, మత ప్రాతిపదికపై ఓటు అడగకూడదు. ప్రార్థనా ప్రదేశాలను ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించకూడదు. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించడం నిషేధం. యజమానులు లేకుండా వారి భూమి, బిల్డింగులను ప్రచారానికి ఉపయోగించరాదు. ఇతర పార్టీ ఎన్నికల ప్రచార మీటింగ్‌లకు ఆటంకం కలిగించరాదు.

ప్రచారం నిబంధనలు

విద్యాసంస్థలు, వాటి మైదానాలను ప్రచారానికి వాడకూడదు. ప్రైవేట్ భూములు, భవనాల యజమానుల లిఖితపూర్వక అనుమతి తీసుకుని పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చాకే వాల్‌పోస్టర్లు అంటించాలి. కరపత్రాలు, పోస్టర్లపై ముద్రణాలయాల పేరు, చిరునామా ముద్రించాలి. ప్రచారంలో భాగంగా టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. అయితే వాటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. దేవుళ్ల ఫొటోలు, అభ్యర్థి ఫొటోలతో డైరీలు, క్యాలెండర్‌లను ప్రచురించరాదు. వాహనాల స్టెఫినీ కవర్లపై కుల, మత సంబంధిత ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండడానికి వీలులేదు. ఎన్ని వాహనాలైనా ఎన్నికల ప్రచారానికి వినియోగించవచ్చు. అయితే రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకుని ఒరిజనల్ అనుమతి పత్రాన్ని వాహనానికి అంటించాలి. ఇంకొకరు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటారు.

తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటు

ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, పోలింగ్ స్టేషన్లకు 200మీటర్ల మీటర్లలోపు అభ్యర్థుల తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేయకూడదు. కార్యాలయంపై పార్టీ జెండా, బ్యానర్, పార్టీ చిహ్నాన్ని పెట్టుకోవచ్చు. రాత్రి 10 గంటల తర్వాత ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు. రాత్రి 10 గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్‌లు నిలిపివేయాలి.